క్లుప్తంగా

మంత్రి విశ్వరూప్‌ను కలసిన మున్సిపల్ డీఈఈ



మంత్రి విశ్వరూప్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మున్సిపల్ డీఈఈ విజయలక్ష్మి

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపల్ డీఈఈగా విజయలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను ఆమె మంత్రి స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి తదితరులు పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో డీఈఈగా పనిచేస్తున్న విజయలక్ష్మి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

విగ్రహ నిర్మాణానికి విరాళం



ఎమ్మెల్యే పొన్నాడకు విరాళం సొమ్ము అందజేస్తున్న సంఘ సభ్యులు

ముమ్మిడివరం: ఐ.పోలవరం మండలం యానాం– ఎదుర్లంక వారధి వద్ద పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ నిర్మాణానికి కె.గంగవరం మండలం మసకపల్లి గ్రామానికి చెందిన అగ్నికుల క్షత్రియ సంఘ సభ్యులు రూ.25 వేల విరాళం సమర్పించారు. ఈ మొత్తాన్ని గురువారం ముమ్మిడివరం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు అందజేశారు. సంఘ సభ్యులు పెమ్మాడి సాల్మన్‌రాజు, సంగాడి లోవరాజు, రత్నా మహాలక్ష్మి, రత్నా రామకృష్ణ, ఆకుల వీరబాబు, ఆకుల రాంబాబులను ఎమ్మెల్యే పొన్నాడ అభినందించారు.

వీఆర్‌ఏల దీక్ష

అల్లవరం: వీఆర్‌ఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని అల్లవరం వీఆర్‌ఏల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక సహకార బ్యాంక్ వద్ద గురువారం రిలే దీక్షలు చేపట్టారు. సంఘ అధ్యక్షుడు మోకా సత్యనారాయణ, ఉపాధ్యక్షులు మాకే చిన సత్యనారాయణ, అల్లవరపు పల్లపురాజు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అమలాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్‌ఏలు ధర్నా చేశారు.

ఉప్పలగుప్తం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మండల వీఆర్‌ఏల సంఘ అధ్యక్షుడు ఉందుర్తి అంజలరావు ఆధ్వర్యంలో వీఆర్‌ఏలు దీక్షలు చేపట్టారు. జల్లి రాంజీ, నేదునూరి పట్టాభి, దోనిపాటి రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా మరిడమ్మ తీర్థ మహోత్సవాలు



తానేల్లంకలో అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

ముమ్మిడివరం: తానేల్లంక శివారు వడ్డిగూడెం శ్రీమరిడమ్మ తల్లి జాతర, తీర్థ మహోత్సవాలు గురువారం జరిగాయి. ఏడు సంవత్సరాల.. ఏడు నెలల.. ఏడు రోజులకు ఒకసారి వచ్చే అమ్మవారి జాతరను ఐదు నెలలుగా 12 గ్రామాల ప్రజలు వంతుల వారీగా నిర్వహిస్తున్నారు. చివరిగా వడ్డిగూడెంలో అమ్మవారి జాతర మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. భాజా భజంత్రీలు, గరగ నృత్యాలు, బాణసంచా కాల్పుల మధ్య ఆయా గ్రామాల ఆడపడుచులు అమ్మవారిని ఊరేగింపుగా అత్తారింటికి సాగనంపారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



పనులకు భూమిపూజ చేస్తున్న అరుణకుమారి

అమలాపురం రూరల్: కామనగరువు పంచాయతీ ఒకటో వార్డు జంగంపాలెం వద్ద గడప గడపకూ మన ప్రభుత్వం గ్రాంట్ నుంచి మంజూరైన రూ.5 లక్షలతో సీసీ రోడ్డుకు గురువారం సర్పంచ్, మండల సర్పంచ్‌ల సమైఖ్య అధ్యక్షురాలు నక్కా అరుణకుమారి భూమిపూజ చేశారు. ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి అడబాల రాజేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ పి.ఆదినారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి కమిటీ సమావేశం

అమలాపురం రూరల్: బండారులంక పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం గురువారం ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగింది. జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, సర్పంచ్ పెరుమాల సునీత పాల్గొన్నారు.

అంతా అప్రమత్తం

- పెరుగుతున్న వరద నీరు
- పరిస్థితిని పరిశీలిస్తున్న అధికారులు



పాతయింజరంలో అవుట్‌ఫాల్ స్లూయిస్‌కు తలుపుల ఏర్పాటు చేస్తున్న అధికారులు

యానాం: యానాం వద్ద గౌతమీ గోదావరి వరదనీరు పెరుగుతుండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి భారీగా వరద నీరు సముద్రంలోకి విడుదల చేయడంతో యానాం వద్ద నీటి ఉధృతి పెరిగింది. ముఖ్యంగా ఓల్డ్ రాజీవ్ నగర్, బాలయోగి నగర్ తదితర ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టారు. రాజీవ్ రివర్ బీచ్ వద్ద వరద పరిస్థితిని ఆర్‌ఏఓ మునిస్వామి పరిశీలించారు. ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఇప్పటికే టూరిజం బోట్లను టైడల్ లాకు వద్దకు తరలించారు. అవుట్‌పాల్ స్లూయిస్‌ల వద్ద లాకు గేట్లకు మరమ్మతులు చేయాలని పలువురు కోరారు.

స్లూయిస్‌లకు తలుపుల ఏర్పాటు

ఐ.పోలవరం: కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు పాతయింజరంలో అవుట్‌ఫాల్ స్లూయిస్‌కు తలుపులు ఏర్పాటు చేశారు. మురమళ్ల, కేశనకుర్రులో లింగాల తూము, నల్లంకి వాని తూము అవుట్‌ప్లాస్ స్లూయిస్‌కు షట్టర్లు బిగించారు. ఈ పనులను మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ పిన్నంరాజు శ్రీనివాసరాజు, హెడ్‌వర్క్స్ ఏఈఈ ఈశ్వరమణ్యం పర్యవేక్షించారు.

అల్లవరం: వరదతో వైనతేయ నది పొంగి కుమ్మరి కాలువ నుంచి నీరు ఎదురెక్కి, బోడసకుర్రులో వరి క్షేత్రాలు ముంపు బారిన పడకుండా సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. కుమ్మరి కాలువ డ్రెయిన్ నుంచి మురుగు బోదెలోకి నీరు రాకుండా సిమెంట్ తూరలు ఏర్పాటు చేసి, మట్టితో అడ్డకట్ట వేశారు. వరి క్షేత్రాల్లోకి ముంపు నీరు రాకుండా రైతుల సహకారంతో ఈ సమస్యకు పరిష్కారం చూపారు.

అధికారుల సమీక్ష

అల్లవరం: వరద ప్రభావిత ప్రాంతాలు, తీర ప్రాంత అధికారులతో అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కృష్ణమోహన్ అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ సాంబశివప్రసాద్ మాట్లాడుతూ వరద పెరుగుతుండడంతో తీర ప్రాంతాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏటిగట్లు తనిఖీ చేసి ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బోడసకుర్రులో వరి క్షేత్రాల్లోకి వరద నీరు రాకుండా సిమెంట్ తూరలు ఏర్పాటు చేస్తున్న రైతులు

కాట్రేనికోన: మండలంలోని బూలవారి మొండి, నడవపల్లి తదితర ప్రాంతాలను తహసీల్దార్ వి.సత్యనారాయణ, ఎంపీడీఓ వెంకటచలం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం, ఇరిగేషన్ జేఈ రామకృష్ణ బృందం పరిశీలించింది. గత వరద సమయంలో ఉధృతిని దృష్టిలో ఉంచుకుని బూలవారి మొండి ప్రాంతంలో ఇసుక బస్తాలు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సర్పంచ్ నాతి అలివేణి, నాతి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

నవరత్నాలతో పేదల సంక్షేమం



కొమరగిరిపట్నంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



చినవలసలలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ శామ్యూల్ సాగర్ తదితరులు

అల్లవరం: ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాలతో పేదల సంక్షేమానికి బాటలు పడ్డాయని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. కొమరగిరిపట్నం–1, 2 సచివాలయాల్లో సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులకు మేలు జరుగుతుందన్నారు. కొమరగిరిపట్నం సచివాలయం పరిధిలో 3,600 మందికి ఉచితంగా సర్టిఫికెట్లు అందిస్తున్నామన్నారు. అనంతరం పలువురికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, సొసైటీ చైర్మన్లు గుర్రం బాబులు, అల్లూరి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా లబ్ధిదారులకు ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్ అన్నారు. గాడిమొగ పంచాయతీ చినవలసలలో సర్పంచ్ కామాడి గోవలక్ష్మి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ ఎం.అనుపమ మాట్లాడుతూ 965 మందికి లబ్ధిదారులకు పత్రాలను ఉచితంగా అందజేశామన్నారు. పంచాయతీ కార్యదర్శి వీజేవీ రమణ, నాయకులు కామాడి మాతరాజు, అంజిబాబు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో సంక్షేమాన్ని అందించడానికే సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకీ అన్నారు. చల్లపల్లి సచివాలయం 1, 3లలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. సచివాలయం 1 పరిధిలో 1579, సచివాలయం 3 పరిధిలో 2024 మందికి ధ్రువపత్రాలు అందించినట్టు ఎంపీడీవో గౌరీకుమారి, తహసీల్దార్ జె.వెంకటేశ్వరి తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, సర్పంచ్ ఇసుకపట్ల జయమణి, ఎంపీటీసీ సభ్యురాలు భోగిశెట్టి సత్యవతిదేవి, రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



మురమళ్లలో వరి నారుమడులను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఐ.పోలవరం: నారుమడులు వేసేటప్పుడు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ సహాయ సంచాలకులు రాజశేఖర్ అన్నారు. గురువారం మురమళ్లలో నారుమడులను జిల్లా వ్యవసాయ అధికారులు, ఏరువాక కేంద్రం నుంచి శాస్త్రవేత్తలు పరిశీలించారు. రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ ఎకరా భూమికి 0.05 సెంట్ల నారుమడి అవసరమని, దీనికి 4 కిలోల ఎస్ఎస్‌పీ, 4 కిలోల యూరియా, 2 కిలోల పొటాష్ అవసరమని వివరించారు. ప్రస్తుతం రైతులు వేసిన నారుమడులు ఆరోగ్యంగా ఉన్నాయని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ప్రదీప్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో పి.శ్రీను, షేక్ దునీషా, విత్తనాల నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

కూరగాయల పెంపకం చేపట్టాలి



కోడూరుపాడులో విత్తనాలను నాటిస్తున్న ఆత్మ పీడీ జ్యోతిర్మయి

అల్లవరం: రైతులు పొలం గట్లపై కూరగాయల పెంపకాన్ని చేపట్టాలని ఆత్మ పీడీ వై.జ్యోతిర్మయి అన్నారు. కోడూరుపాడులో షెడ్ నెట్ నర్సరీల వద్ద గురువారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యమైన కూరగాయలను పెంచుకోవటం ద్వారా ఖర్చు ఆదా చేసుకోవచ్చన్నారు. ఏవో శ్రీనివాస్, సింహాద్రి, సూరిబాబు, బాబూరావు, ప్రసాద్ తదదితరులు పాల్గొన్నారు.

కూలిన రక్షణగోడ



కనకాలపేట వద్ద నదిలో కలిసిపోతున్న లంక భూములు

యానాం: కనకాలపేట గ్రామాన్ని ఆనుకుని ఉన్న లంక భూములు గోదావరి నదీ గర్భంలో కలిసిపోతున్నాయని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గత ఏడాది జూలైలో వచ్చిన వరదలతో ఏటిగట్టుకు ఆనుకుని ఉన్న రివిట్‌మెంట్ 20 మీటర్ల మేర గోదావరి వరద తాకిడికి కోతకు గురైంది. ఎన్నోసార్లు ఈ సమస్యపై అధికారులకు విన్నవించినప్పటికీ వారు నిర్లక్ష్యం వహించడంతో ప్రస్తుతం అదికాస్తా 40 మీటర్లకు చేరుకుందని వారు వాపోయారు. ప్రస్తుతం గౌతమీ గోదావరి వరద ఉధృతి పెరగడంతో లంకలు కోతలకు గురవుతున్నాయని, కొబ్బరి చెట్లు సైతం గోదావరి నదిలో కలిసిపోతున్నాయని అంటున్నారు. 16 నెలల క్రితమే రివిట్‌మెంట్‌కు మరమ్మతులు చేసినప్పటికి, నాసిరకం పనుల వల్ల రక్షణ గోడ కూలిపోయిందని రైతులు ఆరోపించారు.

ఎమ్మెల్యే అశోక్‌కు పరామర్శ



ఎమ్మెల్యే అశోక్‌ను పరామర్శిస్తున్న ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: ఎడమ కాలికి ఆపరేషన్ చేయించుకున్న యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను గురువారం గోపాల్‌నగర్‌లో ఆయన స్వగృహంలో ఆర్‌ఏఓ మునిస్వామి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని నెలల కిందట ఎమ్మెల్యే అశోక్‌కు ఎడమకాలి లోపలి భాగంలో నరానికి గాయమైంది. అప్పటి నుంచి ఆయన పట్టించుకోకుండా పుదుచ్చేరి, ఢిల్లీ తదితర ప్రాంతాల్లో ప్రజా సమస్యలపై పర్యటనలు చేయడంతో ఇటీవల అది పెద్దది కావడంతో హైదరాబాద్‌లో వైద్యులు ఆపరేషన్ చేశారు. దీంతో ఆయన కోలుకుంటున్నారు. పీడబ్ల్యూడీ ఈఈ వీరసెల్వం, నాయకులు పండు సిద్ధార్థకుమార్, నక్కల సుబ్బన్న, సబ్బతి లోకేష్, కవల కోటి, పండు తదితరులు పాల్గొన్నారు. గౌతమీ గోదావరి వరద ఉధృతితో తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై ఎమ్మెల్యే అశోక్ ఆర్‌ఏఓ మునిస్వామితో సమీక్షించారు. తీర గ్రామాలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

మహిళల స్వయం ఉపాధికి శిక్షణ

అమలాపురం టౌన్: స్థానిక ఎర్ర వంతెన వద్ద శ్రీవేద మాత గాయత్రీ దివ్య భవ్య సాధన మందిరంలో మహిళల స్వయం ఉపాధికి టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఈ తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. సుమారు 40 మంది మహిళలు హాజరయ్యారు. ఈ శిక్షణ తరగతులను లక్ష్మీనరసింహ గీతాలక్ష్మి, సుజాత, గాయత్రీ ట్రస్ట్ సభ్యులు ఆకుల బాబి, శ్రీదేవి దంపతులు, కోకా రాంబాబు ప్రారంభించారు. ఆకుల మంజుల ట్రైనర్‌గా వ్యవహరించారు.

పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ



విద్యార్థుల ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఏఆర్ డీఎస్పీ విజయసారథి

అమలాపురం టౌన్: పచ్చదనం, పరిసరాల పరిశుభ్రతతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు (ఏఆర్) డీఎస్పీ పి.వి జయసారథి అన్నారు. స్థానిక నారాయణ పాఠశాలలో గురువారం జరిగిన వన మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రామచంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ×గో గ్రీన్... సేవ్ ఎర్త్‌¤ అంటూ నినాదాలు చేశారు. అనంతరం విద్యార్థుల ర్యాలీని డీఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. మరో అతిథి, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక్కో మొక్కను బాధ్యతగా పెంచాలని సూచించారు. పాఠశాల ఆవరణలోనే విద్యార్థులు మానవహారం నిర్వహించి పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం విద్యార్థులకు పచ్చని మొక్కలు పంపిణీ చేశారు. నారాయణ పాఠశాల ఏజీఎం శ్రీనివాసరెడ్డి, చాంప్స్ కోఆర్డినేటర్ నవీన్, వైస్ ప్రిన్సిపాల్ సురేఖ పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం

యానాం: నియోజకవర్గ శివారు సీతారామనగర్ సమీపంలో గురువారం మధ్యాహ్నం ఓ తాటాకిల్లు పూర్తిగా కాలిపోయింది. దరియాలతిప్ప సీతారామనగర్ సమీపంలోని నేరెళ్లమ్మ గుడి వద్ద గుర్రం సత్యవతి అనే వృద్ధురాలి తాటాకింటి నుంచి అగ్ని కీలలు వ్యాపించడంతో ఇంట్లో సామగ్రి దగ్ధమయ్యాయి. యానాం, రిలయన్స్ ఫైర్ స్టేషన్ల సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఆ ఇంట్లో పొయ్యి నుంచి వచ్చిన మంటల కారణంగా నిప్పు రేగి ఉంటుందని, సుమారు రూ.50 వేల నష్టం జరిగిందని సిబ్బంది తెలిపారు.

జూదరుల అరెస్ట్

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెంలో పేకాటాడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు కోరంగి ఎస్సై పి.శ్రీనివాసకుమార్ తెలిపారు. వారి నుంచి రూ.2200 స్వాధీనం చేసుకున్నామన్నారు.

వలంటీర్లకు వందనం

సేవే పరమావధిగా..



కాకినాడ వెళ్లి పద్మనాభానికి పింఛను అందజేస్తున్న వలంటీర్ సునీత (ఫైల్)

ఉప్పలగుప్తం: ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా వలంటీర్ వ్యవస్థ పని చేస్తుంది. నాలుగున్నరేళ్లుగా సేవే పరమావధిగా సాగుతోంది. ఉప్పలగుప్తం మండలం మునిపల్లిలో వలంటీర్‌గా అయితాబత్తుల సునీత పని చేస్తోంది. ప్రతి నెలా తన పరిధిలో అందరికీ పింఛన్ల సొమ్ము అందిస్తోంది. వివిధ కారణాలతో ఇతర ప్రాంతాల్లో ఉన్నవారికీ అక్కడి వెళ్లి మరీ పింఛను ఇస్తుంది. కొన్ని నెలల కిందట నిమ్మకాయల పద్మనాభం అనారోగ్యానికి గురయ్యారు. ఆయన కుమారుడు కాకినాడలో ఉండడంతో అక్కడే ఉండి చికిత్స పొందేవారు. ఆ సమయంలో పింఛను తీసుకోవడానికి గ్రామానికి రాలేని పరిస్థితి ఉండేది. వలంటీర్ సునీత తన భర్త సహాయంతో బైక్‌పై ప్రతి నెలా కాకినాడకు వెళ్లి పింఛను ఇచ్చేది. ఇలా ఆరు నెలలు ఇచ్చింది. అదే విధంగా తన పరిధిలో నిమ్మకాయల జానకీలక్ష్మి, నిమ్మకాయల రంగయ్యనాయుడు అమలాపురంలో ఉంటున్నారు. వారికీ ప్రతి నెలా పింఛన్‌ను అమలాపురం వెళ్లి అందజేస్తుంది.

సొంత బిడ్డలా వచ్చి..



నేను అనారోగ్యం కారణంగా కాకినాడలోని మా అబ్బాయి ఇంటి వద్ద ఉంటూ పింఛను తీసుకోవడానికి ఇబ్బంది పడేవాడిని. ఆ సమయంలో వలంటీర్ సునీత మా పరిస్థితి అర్థం చేసుకుని 6 నెలల పాటు తన భర్తను తోడుగా తీసుకువచ్చి పింఛను ఇచ్చింది. సొంత బిడ్డలా వలంటీర్ నాపై చూపిన అభిమానం మరువలేం. –నిమ్మకాయల పద్మనాభం, మునిపల్లి

రెగ్యులర్ చేయాలని వినతి



మంత్రి విశ్వరూప్‌కు వినతిపత్రం అందిస్తున్న సూరపరాజు, సాయిరాం తదితరులు

అమలాపురం రూరల్: పంచాయతీల్లో కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ మంత్రి పినిపే విశ్వరూప్‌కు గురువారం సిబ్బంది వినతి పత్రం అందజేశారు. సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లి కాంట్రాక్ట్ సిబ్బందికి న్యాయం చేయాలని జిల్లా పంచాయతీ కార్యదర్శుల యూనియన్ అధ్యక్షుడు రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు, కార్యదర్శి నిమ్మకాయల సాయిరాం ఆధ్వర్యంలో సిబ్బంది భట్లవిల్లిలో మంత్రి విశ్వరూప్‌ను మర్యాద పూర్వకంగా కలసి వినతిపత్రం అందజేశారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. సంఘ ప్రతినిధులు కట్టా సత్యబాబ్, సింగంపల్లి దుర్గా శ్రీనివాస్, అడబాల రాజా పాల్గొన్నారు.

ముమ్మిడివరం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నగర పంచాయతీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు స్థానిక కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం నగర పంచాయతీ మేనేజర్ పీవీ సూకరాజుకు వినతి అందజేశారు. సంఘ అధ్యక్షులు పెట్టా శివప్రసాదరావు, మొక్కపల్లి శ్రీనివాసరావు, వంటపాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత



విద్యార్థులకు బ్యాగులు, గొడుగులు అందజేస్తున్న దరియాలతిప్ప గ్రామ పెద్దలు

యానాం: దరియాలతిప్పలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు చేయూత అందించారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పెద్దలు సబ్బతి శ్రీనివాసరావు, కమిడి బాలయోగి, గిడ్ల వెంకన్న, దాసరి బుజ్జి ఆర్థిక సహాయంతో 1 నుంచి 5 వ తరగతి వరకూ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బ్యాగులు, గొడుగులు అందజేశారు. హెచ్‌ఎం ధనలక్ష్మి పాల్గొన్నారు.

అల్లవరం: ఎమ్మెల్సీగా బొమ్మి ఇజ్రాయిల్ ప్రమాణ స్వీకారం చేసి వంద రోజులు పూర్తయిన సందర్భంగా అల్లవరం ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు. బొమ్మి నరసింహమూర్తి, మంగాయమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ తనయుడు నాగేంద్ర సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గుర్రానికి అరుదైన శస్త్రచికిత్స



గుర్రానికి కంటి శస్త్రచికిత్స చేస్తున్న జేడీ మూర్తి

ఉప్పలగుప్తం: కంటి వ్యాధితో బాధపడుతున్న అశ్వానికి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కర్నీడి మూర్తి అరుదైన శస్త్రచికిత్స చేశారు. భీమనపల్లికి చెందిన రైతు ఎస్.వెంకటరమణ ఎనిమిది నెలల వయసు కలిగిన గుర్రాన్ని పెంచుతున్నాడు. వారం రోజులుగా ఈ గుర్రం కంటి నుంచి నీరు కారుతూ చూపు కనపడక తినడం, తాగడం మానేసింది. ఆ విషయాన్ని గమనించిన రైతు 1962 పశువైద్య అంబులెన్స్‌ను సంప్రదించారు. దీనితో గుర్రానికి స్థానికంగా ఉన్న పశువైద్య కేంద్రంలో జేడీ మూర్తి, ఏడీ ఎల్.విజయరెడ్డి, పశు వైద్యుడు రమేష్ గురువారం శస్త్రచికిత్స చేశారు. జేడీ మూర్తి మాట్లాడుతూ సాధారణంగా సెటీరియా డిజిటేటా అనే పరాన్నజీవి కంటిలో చేరి లార్వాలా వ్యాపిస్తుందన్నారు. ఈ లార్వాలు కంటి లోపలకు చొచ్చుకుపోయి శాశ్వతంగా చూపు కోల్పోతుందన్నారు. తెల్ల, నల్ల గుడ్డు మధ్య భాగంలో ఉన్న యాంటీరియల్ చాంబర్‌లో ఈజీవిని తొలగించామన్నారు. పశు వైద్యులు హెబ్సిబా, నిరోషా, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీపీవో కృష్ణకుమారి

అమలాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 26న తేదీన అమలాపురం బాలయోగి స్టేడియంలో జరిగే కార్యక్రమంలో మహిళా సంఘాలకు సున్నా వడ్డీ రాయితీ అందిస్తారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు గురువారం జిల్లా పంచాయతీ అధికారి వి.కృష్ణకుమారి సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించారు. స్టేడియంలో పూర్తి స్థాయి పారిశుధ్య కార్యక్రమాలు చేయిస్తున్నారు. ఆమె వెంట డివిజనల్ పంచాయతీ అధికారి పి.బొజ్జిరాజు, ఈవోపీఆర్డీ జి.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

అమలాపురం రూరల్: స్థానిక లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా గోకవరపు మల్లికార్జున స్వామి, కార్యదర్శిగా చిక్కాల సతీష్, కోశాధికారిగా తాడి వెంకట సురేష్ కుమార్, సభ్యుల ప్రమాణ స్వీకారం గురువారం జరిగింది. స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాల్ కమ్ సర్వీస్ సెంటర్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. పూర్వ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ శేట్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఆపన్నులను ఆదుకోవడమే లక్ష్యంగా సభ్యులు పని చేయాలన్నారు. పూర్వ జిల్లా గవర్నర్ దాసరి తిరుమలరావు, ముంజులూరి విశ్వేశ్వరరావు నూతన కమిటీచే ప్రమాణ స్వీకారం చేయంచారు. ఉప జిల్లా గవర్నర్లు ఈశ్వర్‌కుమార్, వజ్రపు కోటేశ్వరరావు, పీఎస్ శర్మ, ముదునూరి శ్రీరామరాజు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందిని నియమించాలని వినతి

ఐ.పోలవరం: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు అన్నారు. ఈ సంఘ పరిధిలో 520 మంది రైతులు ఉన్నారు. అయితే ఒక్క అటెండర్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల సంఘంలో ఉద్యోగులు రిటైర్ అయ్యారు. గురువారం తాము తీసుకున్న రుణాల కాలపరిమితి మించిపోవడంతో నగదు తీసుకొని రెన్యువల్‌కు పలువురు రైతులు సహకార సంఘానికి వెళ్లారు. అక్కడ సిబ్బంది లేక వారు మురమళ్ల డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ బాబూరావుకు సమస్యను వివరించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తామని ఆయన అన్నారు. రైతులు ఎల్.బాబి, డి.తమ్మయ్య ఉన్నారు.

బాధితుడికి సాయం

యానాం: స్థానిక ట్యాక్సీ స్టాండ్‌లో డ్రైవర్‌గా ఉంటూ జీవనం సాగిస్తున్న సాత్రా నాగు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన తలకు మేజర్ ఆపరేషన్ జరిగింది. ఈ నేపథ్యంలో సహచర ట్యాక్సీ డ్రైవర్లు స్పందించి గురువారం రూ.15 వేలు, రెండు బస్తాల బియ్యాన్ని ఆయనకు అందజేశారు. నాగు కుటుంబం ఆర్థిక పరిస్థితిని గమనించి ఇళ్ల వాసు, పంపన మధుబాబు ఆధ్వర్యంలో డ్రైవర్లు సేకరించిన మొత్తాన్ని ఇంజరంలో ఉంటున్న నాగు నివాసానికి వెళ్లి అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్, కన్వీనర్ కుంచె సత్యనారాయణ పాల్గొన్నారు.

మెడికల్ కోర్సుల్లో రిజర్వేషన్లు

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రభుత్వ స్కూల్స్‌లో చదివిన విద్యార్థులకు ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర మెడికల్ కోర్సుల్లో 10 శాతం అంతర్గత కోటా రిజర్వేషన్లు కేటాయింపు ఫైల్‌ను గురువారం ఎల్జీ తమిళిసై సౌందరరాజన్ ఆమోదించారు. త్వరలో అంతర్గత కోటా అమలు పొందనుంది.

ఓటర్ల జాబితాపై అవగాహన

ఉప్పలగుప్తం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ జె.వెంకటేశ్వరి అధ్యక్షతన ఓటర్ల జాబితాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయా పార్టీల నాయకులు, గ్రామ స్థాయి బీఎల్‌వోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శుక్రవారం నుంచి ఈ నెల 28 వరకూ గ్రామాల్లో ఇంటింటా ఓటర్ల జాబితాను తనిఖీ చేస్తారన్నారు.